క్లుప్తంగా

కాటికోటేశ్వర క్షేత్రంలో ప్రత్యేక పూజలు



పూజలు అందుకున్న కాటికోటేశ్వరస్వామి

తాడిమర్రి: చిల్లవారిపల్లి సమీపంలోని కాటికోటేశ్వరస్వామి క్షేత్రంలో సోమవారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ పూజారి మూలవిరాట్‌కు వెండి ఆభరణాలు తొడిగి, వివిధ రకాల పుష్పాలతో అందంగా అలంకరించారు. భక్తులు గదాగుండంలో పుణ్యస్నానాలు ఆచరించి, ఆలయ ప్రదక్షిణలు చేశారు. అనంతరం స్వామికి కొబ్బరి కాయలు సమర్పించి పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం పూజారి భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు.

వైభవంగా గంగమ్మ విగ్రహ ప్రతిష్ట



ఆలయంలో కొలువైన గంగమ్మ తల్లి

నల్లచెరువు: కమ్మవారిపల్లిలో నూతనంగా నిర్మించిన గంగమ్మ ఆలయంలో అమ్మవారి విగ్రహ ప్రతిష్టను గ్రామస్తులు వైభవంగా నిర్వహించారు. అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి భక్తిశ్రద్ధలతో ఐదు రోజులుగా వేదపండితుల మంత్రోచ్చారణల మధ్య పూజలు చేశారు. సోమవారం గంగమ్మతల్లికి ప్రాణ ప్రతిష్ట చేశారు. కార్యక్రమానికి మండల వ్యాప్తంగా ఉన్న భక్తులు హాజరై అమ్మవారిని దర్శించుకున్నారు. భక్తులకు నిర్వాహకులు అన్నదానం చేశారు.

రిటైర్డ్ ఉద్యోగి నిజాయితీ



మునిస్వామికి ఫోన్ అందజేస్తున్న సుబ్బరాయుడు

కదిరి అర్బన్: తనకు దొరికిన సెల్‌ఫోనును రిటైర్డు ఉద్యోగి బాధితుడికి అప్పగించి నిజాయితీ చాటుకున్నారు. సోమవారం ఉదయం పట్టణంలోని ఎస్టీఎస్ఎన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో పలువురు వాకింగ్ చేయడానికి వచ్చారు. వాకింగ్ చేస్తున్న ఆర్టీసీ రిటైర్డు ఉద్యోగి సుబ్బరాయుడుకు ఒక సెల్‌ఫోన్ దొరికింది. తోటి వాకర్స్‌తో కలిసి ఆ ఫోన్ తలుపుల మండలానికి చెందిన మునిస్వామి అనే ఉపాధ్యాయుడిదని గుర్తించారు. అనంతరం బాధితుడు మునిస్వామికి రిటైర్డు ఉద్యోగి సెల్‌ఫోన్ అందజేశారు. బాధితుడు కృతజ్ఞతలు తెలిపారు.

విద్యుదాఘాతంతో మూడు గొర్రెల మృతి



చనిపోయిన గొర్రెలు

తలుపుల : బండ్లపల్లి పంచాయతీలోని ఎగువ హరిజనవాడ ఉత్తన్నకు చెందిన 3 గొర్రెలు విద్యుదాఘాతంతో సోమవారం మృతి చెందాయి. బాధితుడు తెలిపిన మేరకు... ఊరికి పక్కన ట్రాన్స్‌ఫార్మర్ వద్ద మేపుతుండగా మూడు గొర్రెలు విద్యుదాఘాతానికి గురయ్యాయి. ఊరిలో వారు వచ్చి చూడగా అప్పటికే అవి చనిపోయాయని బాధితుడు తెలిపాడు. రూ.60 వేల దాకా నష్టం వాటిల్లిందని వాపోయాడు. ప్రభుత్వం ఆర్థిసాయం అందించి ఆదుకోవాలని కోరుతున్నాడు.

20న ఉచిత గుండె వైద్య శిబిరం

నల్లచెరువు: గురుపౌర్ణమి సందర్భంగా సాయిబాబా గుడి ట్రస్ట్ ఆధ్వర్యంలో మదనపల్లికి చెందిన శ్రీ వెంకటేశ్వర హాస్పిటల్ సహకారంతో ప్రముఖ గుండె వైద్య నిపుణులు డాక్టర్ బాల కిషోర్ ఈ నెల 20న నల్లచెరువులోని సాయిబాబా గుడి వద్ద ఉచిత గుండె వైద్య శిబిరం నిర్వహించనున్నారు. షుగర్, బీపీ, ఈసీజీ వంటి పరీక్షలు ఉచితంగా చేయనున్నట్లు ట్రస్ట్ సభ్యులు తెలిపారు. మండల ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.



కదిరి ఈద్గా మైదానంలో సామూహిక ప్రార్థనల్లో పాల్గొన్న ముస్లింలు



తలుపుల ఈద్గా మైదానంలో ప్రార్థనలు చేయిస్తున్న మతపెద్ద అల్లాబక్ష్

సేవా గుణం అలవర్చుకోవాలి

● ఘనంగా బక్రీద్ వేడుకలు

కదిరి/ నల్లచెరువు/ గాండ్లపెంట/ తనకల్లు/ తలుపుల/ ఎన్పీ కుంట: త్యాగ నిరతికి ప్రతీక అయిన బక్రీదు పండుగను సోమవారం కదిరి, ధర్మవరం, పుట్టపర్తి, రాప్తాడు నియోజకవర్గాల్లో ముస్లింలు భక్తి శ్రద్ధలతో ఘనంగా జరుపుకున్నారు. కదిరిలో ఈద్గా మైదానం ఉదయం 8 గంటలకే ముస్లింలతో కిక్కిరిసిపోయింది. స్థలం సరిపోక ఎంతోమంది ముస్లింలు కదిరి–బెంగళూరు రహదారిపై కూడా సామూహిక ప్రార్థనలు చేయడం కన్పించింది. పోలీసులు ఆ దారి గుండా వాహనాలు వెళ్లకుండా ఆంక్షలు విధించి దారి మళ్లించారు. ప్రతి మనిషి సహన గుణం అలవరుచుకోవాలని ముస్లిం మత పెద్దలు సూచించారు. త్యాగమంటే ప్రాణాలర్పించడం కాదని, తమకున్న దాంట్లో ఎంతో కొంత ఇతరులకు సాయం చేయడమని తెలిపారు. బక్రీదు పర్వదినం అల్లాకు ఎంతో ప్రీతిపాత్రమైన రోజన్నారు. సామూహిక ప్రార్థనల అనంతరం ముస్లింలతో పాటు కదిరి ఎమ్మెల్యే కందికుంట వెంకట ప్రసాద్, మాజీ ఎమ్మెల్యే అత్తార్ చాంద్‌బాషా, మాజీ మంత్రి మహమ్మద్ షాకీర్, మాజీ ఎంపీ కర్నల్ నిజాముద్దీన్, వైఎస్సార్‌సీపీ మాజీ సమన్వయకర్త ఎస్ఎండీ ఇస్మాయిల్, మైనార్టీ నాయకులు పరికి షామీర్‌బాషా, సాదిక్, పఠాన్ జాఫర్‌ఖాన్ తదితరులు ఆలింగనం చేసుకుని 'ఈద్ ముబారక్' చెప్పుకున్నారు.

- నల్లచెరువు మండల వ్యాప్తంగా ముస్లింలు బక్రీద్ వేడుకలను సోమవారం ఘనంగా జరుపుకున్నారు. వైఎస్సార్‌సీపీ నాయకులు, ప్రజా ప్రతినిధులు మండలంలోని ముస్లింలకు బక్రీద్ శుభాకాంక్షలు తెలిపారు.
- గాండ్లపెంట మండలంలో ముస్లింలు భక్తి శ్రద్ధలతో బక్రీద్ నిర్వహించారు. మండల కేంద్రంతో పాటు కటారుపల్లి, మలమీదపల్లి, జీనులకుంట, రెక్కమాను, తాళ్లకాల్వ, కమతంపల్లి, కటకంవారిపల్లి, తూపల్లి గ్రామాల్లోని ఈద్గాలకు వెళ్లి సాముహికంగా ప్రార్థనలు చేశారు. పండుగ ప్రాముఖ్యతను ఆయా మసీదుల ఇమామ్‌లు వివరించారు. సాముహిక ప్రార్థనల అనంతరం శుభాకాంక్షలను తెలుపుకుని ఆలింగనం చేసుకున్నారు.
- తనకల్లు మండల కేంద్రంతో పాటు దుగినేపల్లి, మారప్పగారిపల్లి, కొక్కంటిక్రాస్, కొక్కంటి, బొంతలపల్లి, టి.సదుం, కొట్టూరు గ్రామాల్లో సోమవారం బక్రీద్ ఘనంగా నిర్వహించారు. మత పెద్దలు మాట్లాడుతూ త్యాగాలకు మారుపేరు బక్రీద్ పండుగ అని అన్నారు. ప్రతి ఒక్కరూ సోదరభావంతో మెలగాలని సూచించారు.
- తలుపుల మండల కేంద్రంలోని కుమ్మరపేట బాబా షర్ఫొద్దీన్ దర్గా ఈద్గా మైదానంతోపాటు గ్రామాల ఈద్గా మైదానాల్లో సోమవారం ముస్లింలు బక్రీద్ పండుగ సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం బంధుమిత్రులకు విందు భోజనాలు ఏర్పాటు చేశారు.
- ఎన్పీకుంట మండల పరిధిలోని పెడబల్లి, గొకనపల్లి, జౌకల, వెలిచలమల, ధనియానిచెరువు గ్రామాల్లో బక్రీద్ ఘనంగా జరుపుకున్నారు. మండల కేంద్రంలోని ఈద్గా మైదానంలో మండల ఖాజీ హజ్రత్ బాబ్జాన్ బక్రీద్ విశిష్టతను వివరించారు. ఇస్లాం మతానుసారం అనాదిగా వస్తున్న ఆచారం ప్రకారం బక్రీద్ ప్రార్థనల అనంతరం మేక, గొర్రెలను ఖుర్బానీ ఇచ్చి మాంసాన్ని పేదలకు పంచి పెట్టారు.

మంచి మార్గంలో పయనించాలి

తాడిమర్రి/ ధర్మవరం అర్బన్/ బత్తలపల్లి: ప్రతి ఒక్కరూ మంచి మార్గంలో పయనించాలని ముస్లిం మతపెద్దలు పిలుపునిచ్చారు. బక్రీదు పర్వదినాన్ని ముస్లింలు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. సోమవారం ఉదయాన్నే ముస్లింలు స్నానాలు ఆచరించి.. ప్రాతఃకాల నమాజులు చేశారు. నూతన వస్త్రాలు ధరించి, అత్తరు పరిమళాలు చల్లుకొని ఇరుగు, పొరుగు, బంధుమిత్రులతో కలిసి మతగురువుల వెంట ఈద్గా మైదానానికి చేరుకొని సామూహిక ప్రార్థనలు నిర్వహించారు ఈద్గా, మసీదుల్లో హాజీలు, మౌలానాలు ఖుద్బా చేసి బక్రీదు విశిష్టతను తెలియజేశారు.

ముదిగుబ్బ: మండలంలో ముస్లింలు భక్తి శ్రద్ధలతో బక్రీద్ వేడుకలు జరుపుకున్నారు. కదిరి రోడ్డు ఈద్గాలోను, పాతూరు ఈద్గాలోను ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

- తాడిమర్రి మండల కేంద్రం తాడిమర్రితో పాటు ఎం.అగ్రహారం, పిన్నదరి, నార్శింపల్లి, దాడితోట, శివంపల్లి, నాయనపల్లి తదితర గ్రామాల్లో ముస్లింలు బక్రీద్ పండుగను ఘనంగా జరుపుకున్నారు. స్థానిక జామియా మసీదులో ఉదయం 9 గంటలకు ప్రత్యేక ప్రార్థనలు చేస్తూ బత్తలపల్లి రోడ్డులో ఉన్న ఈద్గా వద్దకు ర్యాలీగా వెళ్లారు. అక్కడ ప్రత్యేక ప్రార్థనల అనంతరం ముస్లింల మతపెద్ద పవిత్ర గ్రంధం ఖురాన్ చదివి వినిపించారు. కార్యక్రమంలో కో ఆప్షన్ సభ్యులు బాబాఫక్రొద్దీన్, హోటల్ మహబూబ్ బాషా, షబ్బీర్, ఇస్మాయిల్ తదితరులు పాల్గొన్నారు.
- ధర్మవరం పట్టణంలోని కేతిరెడ్డికాలనీ సమీపాన ఈద్గా మైదానంలో ముస్లింలు బక్రీద్ పర్వదినాన్ని పురస్కరించుకుని ప్రత్యేక ప్రార్థనలు చేశారు.
- మండల కేంద్రమైన బత్తలపల్లి ఈద్గా మైదానంలో ముస్లింలు బక్రీద్ ఘనంగా చేసుకున్నారు. మదీనా, జామియా, నూరాని మసీదుల ముతవల్లిలు కరీంసాబ్, జిలాన్‌సాబ్, మత పెద్దలు మాబ్బాషా, ఖాశీంసాబ్, సత్తార్ తదితరులు సందేశం అందించారు.

ఈద్ ముబారక్

అమడగూరు : మండలంలోని ముస్లింలు భక్తి శ్రద్ధలతో పండుగ జరుపుకున్నారు. అమడగూరు, మహమ్మదాబాద్, పూలకుంటపల్లిలోని మసీదుల వద్దకు వెళ్లి ముజావర్ సందేశాన్ని శ్రద్ధగా విన్నారు. అనంతరం అల్లాకు నమస్కరించి, ఒకరినొకరు అలింగనం చేసుకుని ఈద్ ముబారక్‌తో ప్రేమాభిమానాలు చాటుకున్నారు.

త్యాగం.. దానగుణం అలవర్చుకోవాలి

పుట్టపర్తి మున్సిపాలిటీలో ఎనుములపల్లి, గోకులం, బీడుపల్లి బ్రాహ్మణపల్లి, ప్రశాంతిగ్రాంలో ముస్లింలు బక్రీద్‌ను ఘనంగా జరుపుకొన్నారు. ప్రేమానురాగాలు, త్యాగం, దాన గుణాలు అలవర్చుకుని దైవం పట్ల భక్తిభావం పెంచుకున్నవారే అల్లాకు పీత్రపాత్రులు అవుతారని మతపెద్దలు పేర్కొన్నారు. పండుగ సందర్భంగా అవాంఛనీయ ఘటనలు జరగకుండా డీఎస్పీ వాసుదేవన్, సీఐ కొండా రెడ్డి బందోబస్తును పర్యవేక్షించారు.

భక్తిశ్రద్ధలతో బక్రీద్

కనగానపల్లి: మండలంలోని పలు గ్రామాల్లో సోమవారం ముస్లింలు బక్రీద్ పండుగను భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. మామిళ్లపల్లి, తగరకుంట, నరసంపల్లి, కుర్లపల్లి మసీదుల వద్ద సామూహిక ప్రార్థనలు చేశారు. మామిళ్లపల్లి గ్రామంలో ఈద్గా మైదానంలో జరిగిన సామూహిక ప్రార్థనల్లో చుట్టు పక్కల గ్రామాల నుంచి వచ్చి వందలాది ముస్లిం సోదరులు పాల్గొన్నారు. త్యాగానికి ప్రతీకగా జరుపుకొనే బక్రీద్ పర్వదినం విశిష్టతను ముస్లిం మత పెద్దలు వివరించారు.



కదిరిలో ప్రార్థనల అనంతరం మత పెద్దలతో వైఎస్సార్‌సీపీ నాయకులు



సామూహిక ప్రార్థనల్లో పాల్గొన్న కదిరి ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్



బత్తలపల్లి ఈద్గా మైదానంలో ప్రార్థనల్లో పాల్గొన్న ముస్లింలు



ఎన్పీకుంట ఈద్గా మైదానంలో బక్రీద్ విశిష్టతను వివరిస్తున్న ఖాజీ హజ్రత్ బాబ్జాన్



గాండ్లపెంటలో సాముహిక ప్రార్థనలో పాల్గొన్న ముస్లింలు



కదిరిలో నమాజ్ చేస్తున్న ముస్లింలు



ముదిగుబ్బలో ప్రార్థనల కోసం వెళ్తున్న దృశ్యం



తాడిమర్రిలో ఈద్గావద్ద బక్రీద్ విశిష్టతను వివరిస్తున్న ముస్లిం మత గురువు

రోడ్డు పైకి మురుగునీరు



గ్రాండ్ ఏరియాలో రోడ్డు పైకి చేరిన మురుగునీరు



సమస్యను వివరిస్తున్న స్థానికులు

పుట్టపర్తి టౌన్: ప్రముఖ ఆధ్యాత్మిక కేంద్రం పుట్టపర్తిలో మురుగునీరు రోడ్డుపై పారుతోంది. పట్టణంలో 3వ వార్డులో జానకి రామయ్య కల్యాణమండపం వీధిలో అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ పొంగి పార్లి రోడ్డుపై చేరి దుర్వాసన వెదజల్లుతోంది. ఆ దారిన వెళ్లాలంటే ప్రజలు ముక్కు మూసుకుని వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోలేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ద్విచక్ర వాహనం అపహరణ

ముదిగుబ్బ: మండల కేంద్రంలోని ఆంధ్రా బ్యాంక్ ఎదుట నివాసం ఉంటున్న చింతల నాయుడు ఇంటి ఆవరణలో పార్క్ చేసిన స్కూటీ ఆదివారం రాత్రి చోరీ అయ్యింది. ఈ మేరకు బాధితుడు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. పోలీసులు సీసీ కెమెరాలు పరిశీలించి దొంగను గుర్తించినట్లు తెలుస్తోంది.

వ్యక్తికి తీవ్ర గాయాలు

అమరాపురం: ఆలదపల్లి చెక్ పోస్టు సమీపంలో సోమవారం బైక్‌పై వెళ్తున్న హనుమంతప్పను ట్రాక్టర్ ఢీకొట్టింది. గాయపడిన హనుమంతప్పను 108 వాహనంలో మడకశిర ఆస్పత్రికి తరలించినట్లు ఈఎంటీ మూర్తి, పైలెట్ పురుషోత్తం తెలిపారు.

ఆటోను ఢీకొన్న ప్రైవేటు బస్సు

పావగడ: పట్టణ పోలీస్‌స్టేషన్ పరిధిలోని దొమ్మతమరి గ్రామం వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో 8 మంది కూలీలు తీవ్రంగా గాయపడిన సంఘటన సోమవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. రొద్దం నుంచి దొమ్మతమరి మీదుగా హిందూపురానికి వెళ్తున్న ఓ ప్రైవేట్ బస్సు ఎదురుగా ప్రయాణీకులతో వస్తున్నను ఉదయం 7 గంటల సమయంలో ఆటోను ఢీ కొంది. దీంతో మడకశిర మండలం రేకులకుంటకు చెందిన ఆటోలోని 8 మంది కూలీలు తీవ్ర గాయాల పాలయ్యారు. ఆటో డ్రైవర్ పరిస్థితి విషమంగా ఉండటంతో తుమకూరు ఆస్పత్రికి తరలించారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో సంఘటనపై కేసు నమోదైంది. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.



గాయాల పాలైన మహిళలు

ముందస్తు పంటలు కళకళ



మొలకెత్తిన వేరుశనగ



కళకళలాడుతున్న జొన్న పంట

మడకశిర: నియోజకవర్గంలో రైతులు ముందస్తుగా సాగు చేసిన వివిధ పంటలు కళకళలాడుతున్నాయి. మే చివరిలో, జూన్ ప్రారంభంలో వర్షాలు కురిశాయి. ఈ నేపథ్యంలో రైతులు ఖరీఫ్ సీజన్‌లో వివిధ పంటలను సాగు చేయడానికి అవకాశం ఏర్పడింది. ముందస్తుగానే రైతులు పంటను సాగు చేశారు. నియోజకవర్గంలోని 5 మండలాల పరిధిలో దాదాపు 380 హెక్టార్లలో రైతులు వేరుశనగ పంటను ముందుగా సాగు చేశారు. మడకశిర, గుడిబండ, అమరాపురం, అగళి మండలాల్లో వేరుశనగ వేశారు. ప్రస్తుతం వేరుశనగ విత్తనాలు మొలకెత్తి పంట కళకళలాడుతోంది. అంతే కాకుండా రైతులు ఈ ఏడాది మూగజీవాలకు మేత కోసం జొన్న పంటను కూడా ముందస్తుగానే సాగు చేశారు. పంట సాగు చేసినప్పటి నుంచి కూడా వర్షాలు ఆశాజనంగా పడ్డాయి. దీంతో జొన్న పంట ఎదగడానికి అవకాశం ఏర్పడింది.

ఆర్థిక సాయం అందజేత

నల్లచెరువు: బెంగళూరులో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో రాగన్నగారిపల్లికి చెందిన మదన్‌మోహన్‌రెడ్డి అనే యువకుడు తీవ్రంగా గాయపడ్డాడు. బెంగళూరులోని ఆస్పత్రిలో చికిత్స చేయించుకుంటున్నాడు. విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బత్తల హరిప్రసాద్ వైద్య ఖర్చుల కోసం తన వంతుగా సోమవారం రూ.25వేల ఆర్థిక సాయం అందజేశారు.

మంచి ఉద్యోగిగా గుర్తింపు పొందాలి



పదవీ విరమణ చేసిన ట్రాఫిక్ ఎస్ఐ రామ్మూర్తి దంపతులను సన్మానిస్తున్న డీఎస్పీ కంజాక్షన్

హిందూపురం: విధి నిర్వహణలో పదవీ విరమణ సర్వసాధారణం. అయితే మంచి పనులతో గుర్తింపు పొందడానికి ప్రతి ఉద్యోగి కృషిచేయాలని డీఎస్పీ కంజాక్షన్ అన్నారు. సోమవారం ట్రాఫిక్ ఎస్ఐగా విధులు నిర్వహిస్తున్న రామ్మూర్తి పదవీ విరమణ చేశారు. ఈ సందర్భంగా ఎస్ఐ రామ్మూర్తి దంపతులను డీఎస్పీ సన్మానించి జ్ఞాపికలు అందజేశారు. ట్రాఫిక్ ఏఎస్ఐ, ఎస్ఐగా రామ్మూర్తి సేవలు అభినందనీయమన్నారు. అనంతరం ఎస్ఐ రామ్మూర్తి దంపతులను సహ ఉద్యోగులు సన్మానించి పదవీ విమరణ శుభాకాంక్షలు తెలియజేశారు.

ఆత్మీయ కలయిక

రామగిరి: మండలంలోని పేరూరు డ్యాంలో ఉన్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1987–88 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు సోమవారం అపూర్వ సమ్మేళనం నిర్వహించారు. దాదాపు 37 సంవత్సరాల అనంతరం పూర్వ విద్యార్థులు ఒకచోట చేరడంతో పాఠశాలలో సందడి వాతావరణం నెలకొంది. ఆనాటి జ్ఞాపకాలు, చిలిపి పనులను ఒకరికొకరు చెప్పుకున్నారు. పరస్పరం యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం విద్యాబుద్ధులు నేర్పిన పూర్వ గురువులను సన్మానించారు. కార్యక్రమంలో శకుంతల, శైలజ, రామక్క, జమున, పద్మజ, రాజశేఖర్, చంద్రశేఖర్, ఈరంటి సతీష్, సుబ్బయ్య, నారాయణ, గంగాధర్, సిద్ధయ్య, లింగన్న, రంగనాయకులు, తిప్పేస్వామి తదితరులు పాల్గొన్నారు.



సమావేశమైన పూర్వ విద్యార్థులు



దుర్గాదేవి



అలంకరణలో వీరభద్రస్వామి

వీరభద్రస్వామి ఆలయంలో పూజలు

లేపాక్షి: మండల కేంద్రంలోని వీరభద్రస్వామి దేవాలయంలో సోమవారం ఉదయం ప్రత్యేక పూజలు చేశారు. ఆలయంలోని వీరభద్రస్వామి, దుర్గాదేవి అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించి విశేష పూజలు చేశారు. అదేవిధంగా అభిషేకార్చనలు, తీర్థప్రసాద వినియోగం, మహా మంగళహారతి ఇచ్చారు.

విశ్రాంత ఉద్యోగులకు సన్మానం

పావగడ: ఇటీవల పదవీ విరమణ పొందిన తాలూకాలోని దొడ్డేనహళ్లి గ్రామానికి చెందిన ఆర్టీఓ తిప్పేస్వామి, బెంగళూరులోని కుమార కృప ప్రభుత్వ అతిథి గృహం వ్యవస్థాపకురాలు పద్మావతి గోవిందయ్యలను స్థానిక వాల్మీకి సంఘం నాయకులు సోమవారం ఘనంగా సన్మానించారు. నిడుగల్ వాల్మీకి ఆశ్రమంలో ఏర్పాటు చేసిన సన్మాన కార్యక్రమంలో వాల్మీకి సంజయకుమార స్వామి మాట్లాడుతూ విశ్రాంత ఆర్టీఓ తిప్పేస్వామి, పద్మావతి గోవిందయ్య పేద కుటుంబంలో జన్మించి అనేక ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొని కష్టపడి చదువుకుని విద్యావంతులై ఉన్నత ఉద్యోగాల్లో రాణించి సామాజిక సేవల్లో పాల్గొన్నారని కొనియాడారు.

ఆలయ కమిటీ సభ్యుల రాజీనామా

హిందూపురం: హిందూపురం మెయిన్‌బజారులోని పేట వెంకటరమణస్వామి ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు తమ పదవులకు మూకుమ్మడిగా రాజీనామా చేశారు. దేవదాయ ధర్మదాయశాఖ కమిషనర్‌కు ఈ మేరకు రాజీనామాలు పంపించినట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి నరసింహమూర్తి తెలిపారు. ఆలయ కమిటీ ఛైర్మన్ నవీన్‌చంద్ర, సభ్యులు లక్ష్మీదేవి, భారతి, వి.రత్న, చంద్రమోహన్, గోపాల్, రామ్మూర్తి తమ పదవులకు రాజీనామా చేశారన్నారు. రాజీనామా విషయంపై దేవదాయశాఖ కమిషనర్ నిర్ణయం తీసుకుంటారన్నారు.